రోడ్డును మింగేసిన అక్రమ నిర్మాణాలు

- జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల చోద్యం
- కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ సైతం బేఖాతర్


తిలక్‌నగర్ రైల్వే ట్రాక్‌ను ఆనుకుని ఉన్న రోడ్డు ఇరుకుగా మారిన దృశ్యం

నల్లకుంట: అక్రమ నిర్మాణాల కారణంగా చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వస్థలాలు కనుమరుగైపోతుండగా ఇక్కడ ఏకంగా రోడ్డే మాయమయ్యే పరిస్థితి దాపురించింది. అక్రమ నిర్మాణాలపై అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల బదిలీపై వచ్చిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మొదట్లో అక్రమనిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. కొద్దిరోజులకే అధికారులు మిన్నకుండిపోయారు. అక్రమ నిర్మాణాలు అలాగే దర్శనమిస్తున్నాయి. నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ రైల్వేబ్రిడ్జి పక్కన హుస్సేన్ సాగర్ నాలాను ఆనుకుని ఓ చిన్నబస్తీ ఉంది. ఈ బస్తీలో 15 కుటుంబాల వరకు నివాసముంటున్నాయి. ఇక్కడి ప్రజల కోసం జీహెచ్‌ఎంసీ అప్పట్లో 25 అడుగుల సీసీరోడ్డు నిర్మించింది. కాగా, కొందరు మున్సిపల్ పరిధిలోకి వచ్చే రోడ్డును ఆక్రమించి అక్రమనిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డును ఆక్రమించి ఇళ్లనిర్మాణం చేపడుతున్న విషయాన్ని గతంలో స్థానికంగా నివాసముండే పి.రాజా అనే వ్యక్తి జీహెచ్‌ఎంసీ డీఎంసీ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు ఎలాంటిచర్యలు తీసుకోలేదు. దీంతో సదరువ్యక్తి కోర్టులో కేసు వేశారు. ఆ సమయంలో పూర్వాపరాలు పరిశీలించిన న్యాయస్థానం రోడ్డుపై అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలంటూ ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసింది. కాగా, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమనిర్మాణాలను తొలగించాలి: రాజా, తిలక్‌నగర్



రోడ్డుపైనున్న అక్రమనిర్మాణాలపై 2008లో కోర్టులో కేసు వేశాను. ఈ మేరకు కోర్టు 2011 జూన్‌లో ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసింది. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఈ విషయమై రైల్వే అధికారులు, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాను. 'ప్రజాదర్బారు'లో కూడా ఫిర్యాదు చేశాను. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి రోడ్డుపైనున్న అక్రమనిర్మాణాలను తొలగించాలి.

వ్యక్తి అదృశ్యం


బండి ప్రవీణ్ కుమార్(ఫైల్)

నల్లకుంట: ఇంటి నుంచి వెళ్లిన ఓ బిల్డర్ అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు... బిల్డర్ బండి ప్రవీణ్ కుమార్(51) కుటుంబసభ్యులతో కలిసి పద్మారావునగర్ వెంకటాపురం కాలనీలో నివాసముంటున్నాడు. ఇతనికి నల్లకుంట మెయిన్ రోడ్డులోని విజయబ్యాంక్ ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్ ఉన్నది. ఈ క్రమంలో ఈ నెల 14న నల్లకుంటకు వచ్చిన ప్రవీణ్ కుమార్ వాచ్‌మెన్‌తో మాట్లాడి వెళ్లిపోయాడు. బయటికి వెళ్లిన ప్రవీణ్‌కుమార్ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినప్పటికీ ఆచూకీ తెలియరాలేదు. ఆందోళన చెందిన అతని కుమారుడు రోహిత్ శనివారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే మద్దతు

గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదగిరిగౌడ్


మాట్లాడుతున్న యాదగిరి గౌడ్

కవాడిగూడ: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గౌడ కులస్థులు మద్దతు కాంగ్రెస్ పార్టీకేనని గౌడ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంటారం యాదగిరిగౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం కవాడిగూడలో జరిగిన గౌడ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే గౌడ కులస్థులతోపాటు చేతి వృత్తిదారులకు న్యాయం జరుగుతుందని అన్నారు. సమావేశంలో గౌడ సంక్షేమ సంఘం నాయకులు గర్వందుల ఆంజయ్యగౌడ్, రమేష్‌గౌడ్, టి.శివకుమార్‌గౌడ్, ఎం.శంకర్‌గౌడ్, రామన్‌గౌడ్ తదితరులతోపాటు గౌడ కులస్థులు పాల్గొన్నారు.

భజరంగ్ సేన సిటీ యూత్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్


భజరంగ్ సేన సిటీ యూత్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్‌కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు

కాచిగూడ: భజరంగ్ సేన సిటీ యూత్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్‌ను నియమిస్తూ భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్ రావు నియామకపత్రాన్ని అందజేశారు. అమిత్ జైస్వాల్, వి.చైతన్య కుమార్, సోమేష్ సోము, ఎం.శ్రీధర్, అజయ్, వివేక్‌లను కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం కాచిగూడలోని భజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించారు. అనంతరం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ హిందూసమాజ సంక్షేమం, రక్షణ కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూర్య శుక్లా, వినయ్ తివారి, నందకిషోర్ అగర్వాల్, ఎర్రం శ్రీనివాస్, శ్రీనివాస్ గుప్తా, ఎం.మనోజ్, తరణ్‌జిత్ సింగ్, రాజారామ్, నరేష్, సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎంబీసీ చైర్మన్ జెరుపటి జైపాల్‌కు సన్మానం


జైపాల్‌ను సన్మానిస్తున్న సత్యనారాయణరాజు, అంతయ్య, కృష్ణయ్య, వెంకటస్వామి

చిక్కడపల్లి: ఎంబీసీ చైర్మన్‌గా నియమితులైన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన జెరుపటి జైపాల్‌ను ఆదివారం వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ సత్యనారాయణ రాజు, వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్యల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్‌లు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, బండల వెంకటస్వామి, హరికృష్ణ, శ్రీరాములు, హనుమంతరావు, మోహన్‌కుమార్, గడ్డం చంద్రయ్య, నల్లగొండ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలోనే ఆనందం


కృష్ణానగర్ లో చలివేంద్రంను ప్రారంభిస్తున్న రవీంద్రనాథ్, పగిడి సత్యవీర్

కాచిగూడ: అందరూ సేవాభావం అలవర్చుకుంటే సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని పగిడి యాదగిరి ఫౌండేషన్ చైర్మన్ పగిడి సత్యవీర్ అన్నారు. పగిడి యాదగిరి ఫౌండేసన్ ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణానగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బస్తీ పంచ్ కమిటీ అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్ సీనియర్ కాంగ్రెస్ నేత పగిడి విజయ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పగిడి విజయ్‌కుమార్, కిషన్ కుమార్, బి.శ్రీధర్, కె.ప్రదీప్ కుమార్, భాస్కర్, వేణుగోపాల్, వి.నర్సింగ్, ఎల్.సాగర్, పగిడి భరత్‌రాజ్, ఎంఎల్‌కే రమణ, శంకర్, కైలాష్, అభిరామ్, ఈశ్వర్, పగిడి కుటుంబ సభ్యులు, బస్తీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ మహిళలకు ప్రతిభాపురస్కారాలు


నాయీ బ్రాహ్మణ మహిళలను ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నాయీ బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు నాయీ బ్రాహ్మణ మహిళలను ప్రతిభా పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. నాయీ బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు దుర్గారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వినయ్‌కుమార్, ప్రముఖకవి డాక్టర్ రాపోలు సుదర్శన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీణా, అనిత, ఎల్.అనుపమ, భాగ్యలక్ష్మి, కె.ఉషారాణి, వై.రేణుక, స్వప్న, నాగరాణి, నవనీత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే ఉపయోగం


బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న సినీనటుడు సుమన్, ఎం.ఎస్.శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్ శ్రీ విజయ గణపతి దేవాలయంలో కరాటే మాస్టర్ విక్కీ గోల్డెన్ డ్రాగన్ కరాటే అకాడమీ మెగా బెల్ట్స్ అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీనటుడు సుమన్, గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.ఎస్.శ్రీనివాస్‌రావులు హాజరై కరాటేలో శిక్షణ పొందిన క్రీడాకారులకు బెల్ట్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివానందగౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

'గురువాయూర్' ఉచిత వైద్యశిబిరం



కాచిగూడ: ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. గురువాయూర్ శ్రీకృష్ణ మందిరం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్ అంబర్‌పేట అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన ఫ్రీ డయాబెటిక్ అండ్ హైపర్ టెన్షన్ క్యాంప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.పుల్లారావు, డాక్టర్ ఎం.యాదగిరి రావు, కాలేరు పద్మవెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'రాయగూడని పద్యం' ఆవిష్కరణ


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాయగూడని పద్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత మౌమిత ఆలం రచించిన, ఉదయమిత్ర స్వేచ్ఛానువాదం చేసిన 'రాయగూడని పద్యం'పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మాతృక ప్రచురణలు, పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి విమల మాట్లాడుతూ ఈ కవిత్వ తూటాలు దేశమంతటా పేలాలని అన్నారు. ప్రజల పక్షాన నిలబడే కవిత్వాలే అజరామరంగా నిలుస్తాయని చెప్పారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేసే ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలన్నారు. పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమాసుందరి, పుప్పాల శ్రీరామ్, దొంతం చరణ్, సాత్విక నన్నబోయిన తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పదో తరగతి పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్


ఏరుకొండ సీతయ్య

చిక్కడపల్లి: పదో తరగతి విద్యార్థినీవిద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతత వాతావరణంలో పరీక్ష రాయాలని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుందని, కాబట్టి ఎవరు కూడా గుంపులు గుంపులుగా వెళ్ళడంగాని, తిరగడం కానీ చేయకూడదని అన్నారు. పరీక్షా కేంద్రాలకు చేరుకోలేని పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులకు లిఫ్టిఇవ్వడంతోపాటు ఇతర సాయం చేయాలని సూచించారు. విద్యార్థులు అవసరమైతే పోలీసు సహాయాన్ని కోరవచ్చని పేర్కొన్నారు. బస్సులలో 10 వరతగతి కేంద్రాలకు చేరుకునే విద్యార్థులకు అనుకోని పరిస్థితులు ఎదురైతే వారికి సాయం చేసి పరీక్ష కేంద్రాల దగ్గరి వరకు లిఫ్ట్ ఇవ్వాలని వాహనచోదకులకు సూచించారు.

కులాల కార్పొరేషన్ల ఏర్పాటు చరిత్రాత్మకం

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అన్నారు. ఆదివారం కాచిగూడలో జరిగిన కుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు అయినప్పటికీ వివిధ కుల సంఘాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కులగణనపై ప్రభుత్వం జీవో జారీ చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసి పాలకమండళ్లను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, టి.రాజ్‌కుమార్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ కృష్ణ

మంచి ఆలోచనలే విజయానికి సోపానాలు


వైశ్య హాస్టల్‌లో డీలక్స్ రూమ్స్‌ను ప్రారంభిస్తున్న ధనుంజయ్

కాచిగూడ: హాస్టల్‌లో విద్యార్థులకు మరిన్ని మెరుగైన వసతులను కల్పించే విధంగా కృషి చేస్తున్నట్లు వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గుడుగుంతల ధనుంజయ్ తెలిపారు. కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో ఏర్పాటు చేసిన రినోవెటిడ్ డీలక్స్ రూమ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో కూడిన మంచి ఆలోచనలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు. వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు కార్యదర్శి విశ్వనాథం నాగేష్, కోశాధికారి కూర రఘువీర్, హాస్టల్ అధ్యక్షుడు ఉప్పాల రాజేశ్వర్, ప్రధానకార్యదర్శి పబ్బతి ప్రసన్న కుమార్, పొద్దుటూరి రాజేశ్వర్‌రావు, గౌరిశెట్టి చంద్రయ్య, కొత్రికే భాస్కర్ గుప్తా, ట్రస్టీలు, హాస్టల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్‌కు సన్మానం



చిక్కడపల్లి: మత్స్య సహకార సమాఖ్య కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన మెట్టు సాయికుమార్‌ను ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి కలసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం గౌరవ అధ్యక్షుడు కైరంకొండ యాదగిరి, పాక రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భిక్షమయ్య సేవలు సమాజానికి అవసరం


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏపీజీవీబీయూ పూర్వ ప్రధాన కార్యదర్శి కారింగు భిక్షమయ్య దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆ యూనియన్ పూర్వ ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు కారింగు భిక్షమయ్య ఉద్యోగ విరమణ సన్మానసభ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆల్ ఇండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ఉద్యోగానికే తప్ప వయస్సుకు కాదని, భిక్షమయ్య సేవలు అనేక రకాలుగా సమాజానికి అవసరమని అన్నారు. ఏపీటీఆర్‌ఆర్‌ఈఏ అధ్యక్షులు బి.రవికాంత్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి, ఏపీజీవీబీయూ అధ్యక్ష, కార్యదర్శులు పి.వేణురావు, రాజు, వివిధ సంఘాల నేతలు జె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సామాజికసేవకు వైశ్య ఫెడరేషన్ ప్రాధాన్యత


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ముషీరాబాద్: సామాజిక సేవాకార్యక్రమాలలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ముందంజలో ఉంటూ పేదలను ఆదుకుంటున్నదని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ భవనంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ సంఘ సేవకుడు రాందాస్ అగర్వాల్ జయంతిని నిర్వహించారు. ఉప్పల శ్రీనివాస్‌గుప్తా వందమంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలతోపాటు ఉన్నత విద్యా అభ్యసించే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, స్కాలర్‌షిప్‌లు, వివాహం చేసుకునేవారికి పుస్తె మెట్టెలు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైశ్య హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ గుప్తా, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మంజుల, నాయకులు సత్తయ్య, పాండయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో జాప్యం.. ప్రజలకు ఇక్కట్లు


పార్సిగుట్ట రోడ్డును పరిశీలిస్తున్న ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు నర్సింగ్‌ప్రసాద్

ముషీరాబాద్: రాంనగర్ నుంచి పార్సిగుట్ట చౌరస్తా వరకు రోడ్డును తవ్వి నెలలు గడుస్తున్నా తిరిగి పనులు చేపట్టకపోవడం వల్ల స్థానికులు, విద్యార్థులు, వ్యాపారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు నర్సింగ ప్రసాద్ అన్నారు. ఆదివారం పార్సిగుట్టలో తవ్విన రోడ్డును స్థానికులతో కలిసి పరిశీలించారు. అనంతరం నర్సింగ్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ మార్గంలో డ్రైనేజీ పైపులు లీకై మురుగునీరు ఇళ్ల ముందు నుంచి పారుతోందన్నారు. ప్రజల ఇబ్బందులను అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీ పెద్దలు రాజు, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపుతోనే కవిత అరెస్టు


సమావేశంలో మాట్లాడుతున్న కోక రవి

ముషీరాబాద్: రాజకీయ కక్షసాధింపు ధోరణితోనే ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేశారని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నేత కోక రవి ఆరోపించారు. ఆదివారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు కేంద్రం కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు కేంద్రం చేస్తున్న అప్రజాస్వామిక కార్యక్రమాలను గుర్తించాలని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ రాష్ట్ర మాజీ కార్యదర్శి జునేద్‌బాగ్దాదీ, నాయకులు డాక్టర్ జగన్, గడ్డం ప్రవీణ్, రాకేష్, కృష్ణ, స్యామ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షాప్యాడ్‌ల పంపిణీ


ముషీరాబాద్‌లో విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేసిన పర్వేజ్, వాజీద్‌ఉద్దీన్

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని పఠాన్‌బస్తీలో గల పాఠశాల విద్యార్థులకు ఆదివారం చాంద్‌సాబి ట్రస్ట్ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ పర్వేజ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు పరీక్షా సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రస్ట్ ఆధ్వర్యంలో తమవంతు సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ వాజీదుద్దీన్, డాక్టర్ మినాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రవిదాస్ మహారాజ్‌కి ఘన నివాళి


సంత్ రవిదాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్, సంఘర్ జాతి సంఘం ప్రతినిధులు


సంత్ రవిదాస్ మహారాజ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నల్లకుంట: నర్సింహబస్తీ కమ్యూనిటీహాల్‌లో జరిగిన సంత్ శ్రీ గురు రవిదాస్ మహారాజ్ 647వ జయంతి వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ అమృత పాల్గొని నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘర్ జాతి సంఘం ప్రధాన కార్యదర్శి పింజరి నర్సింగ్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ విష్ణు, క్యాదర్శి కె.లక్ష్మణ్ ప్రసాద్, వైస్ చైర్మన్ కె.ప్రభుదాస్, కిషన్, సురేష్, సంతోష్, నరేందర్, యాదగిరి, శివ, మోచి కుల సంఘం నగర అధ్యక్షుడు ఎం. జితేందర్, కార్యదర్శి హెచ్.నర్సింగ్, బీజేపీ నాయకులు ఎంబీ. కిశోర్ కుమార్, కేజే. బాబు, శివ మంగీ, మధుసూదన్, హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

- నర్సింహబస్తీ కమ్యూనిటీ హాల్‌లో సంఘ సంస్కర్త సంత్ శ్రీ గురు రవిదాస్ మహారాజ్ 647వ జయంతి వేడుకల్లో పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి ఎంబీ కిశోర్ కుమార్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే బాబు, ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.మధుసూదన్, బీజేపీ ఎస్సీ మోర్చా అంబర్‌పేట కన్వీనర్ మంగి శివ కుమార్ తదితరులు రవిదాస్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.